క్లుప్తంగా

కొండలమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



గుడ్లవల్లేరు: శ్రీకొండలమ్మ అమ్మవారి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు తమ తమ మొక్కుబడులను భక్తిప్రపత్తులతో చెల్లించుకునేందుకు బారులు తీరారు. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వీల్ చైర్ అందజేత



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీకొండలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే నడవలేని వృద్ధులు, వికలాంగుల సౌకర్యార్థం వీల్ చైర్‌ను గుడ్లవల్లేరుకు చెందిన ఆయుర్వేద వైద్యుడు బక్కు లక్ష్మీనాగేంద్రరావు దంపతులు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాత కుటుంబాన్ని సన్మానించి అమ్మవారి చిత్ర పటంతోపాటు లడ్డూ ప్రసాదాలను అందజేశారు. తొలుత దాత కుటుంబం పేరిట అమ్మవారికి వేద పండితులు ప్రత్యేక పూజలను చేశారు.

ముగిసిన గంగానమ్మ జాతర ఉత్సవాలు



రాపర్ల(పామర్రు): గ్రామంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న గంగానమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. తొలుత ఆలయంలోని అమ్మవారికి 108 బిందెలతో జలాభిషేకం చేశారు. పసుపు, కుంకుమ నూతన వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. గ్రామంలో గంగానమ్మ అమ్మవారిని, పోతురాజులను అంగరంగ వైభవంగా మేళ తాళాలతో ఊరేగించారు. చివరి రోజున అమ్మవారికి గ్రామస్తులు మొక్కుబడులను తీర్చుకున్నారు. ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి డీఎన్నార్ పూజలు



కైకలూరు: అభయాంజనేయస్వామి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరికీ అందాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆకాంక్షించారు. ఆటపాక పంచాయతీ శివారు నాగాపురంలో హనుమజ్జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. ప్రజలు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సింగంశెట్టి రాము, పార్టీ నాయకులు పంజా రామారావు, చవల రజినీకాంత్, సమయం రామాంజనేయులు, తోట మహేష్, కన్నా రమేష్, తమ్మిశెట్టి కొండ, పిచ్చేటి పెద్దిరాజు, చిల్లిముంత శ్యామలరావు, గుమ్మ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలి

గుడ్లవల్లేరు: పీఎంఏవై 1.0 లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ మండల ఏఈ ఆలపాటి సురేంద్ర సూచించారు. ఆదివారం ఆయన విలేకరులకు వివరాలు తెలిపారు. గుడ్లవల్లేరు మండలంలో పీఎం ఆవాస్ యోజన 1.0 పథకంలో భాగంగా 2,761 మంజూరు అయ్యాయన్నారు. అందులో మే 31వ తేదీకి 1,095 ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. ఇంకా 841ఇళ్ల నిర్మాణం మొదలు పెట్టలేదని, 825ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని పేర్కొన్నారు. లబ్ధిదారులు అక్టోబర్ 31వ తేదీలోగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు.

పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కైకలూరు: నియోజకవర్గంలో విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గ పేద విద్యార్థులకు కైకలూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పుస్తకాల పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా పాఠశాలలు పునఃప్రారంభ సమయంలో పుస్తకాలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, విశ్వబ్రాహ్మణ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు తుపాకుల సోమాచారి తదితరులు పాల్గొన్నారు.

ఈ రహదారిపై నడక ఎలా..?

- ఇబ్బంది పడుతున్న జమీదగ్గుమిల్లి ప్రజలు
- ప్రమాదాల పాలవుతున్న వాహనదారులు



అధ్వానంగా మారిన జమీదగ్గుమిల్లి రహదారి

జమీదగ్గుమిల్లి(పామర్రు): జమీదగ్గుమిల్లి గ్రామంలోని ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో ఈ రోడ్డుపై ప్రయాణం చేయడానికి స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని రహదారి గోతులు పడి రాళ్లు పైకి తేలడంతో రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. స్థానిక హైస్కూల్ నుంచి జమీదగ్గుమిల్లి, పోలవరం, ఉంద్రపూడి వరకు సుమారు 2.5 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రహదారి పూర్తిగా పాడైపోయింది. రహదారి గోతులతో నిండి ఉండటంతో స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఇదే రహదారి వెంబడి జమీదగ్గుమిల్లి, పోలవరం, ఉంద్రపూడి గ్రామాలకు చెందిన రైతుల పొలాలు ఉన్నాయి. దీంతో వారు ఈ రహదారిలో ప్రయాణించి తమ తమ పొలాలకు చేరుకోవాలి. కానీ రహదారి గోతులమయంగా మారడం వల్ల రైతులు కూడా తమ పొలాలకు వెళ్లి రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఉంద్రపూడి, పోలవరం గ్రామాల నుంచి అనేక మంది విద్యార్థులు జమీదగ్గుమిల్లిలోని హైస్కూల్‌కు ఈ రహదారి గుండా రావాల్సి వస్తోంది. రహదారి అధ్వానంగా మారడం వల్ల విద్యార్థులు రాకపోకలకు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.

రాత్రి వేళల్లో అవస్థలు

రహదారి గోతులతో ఉండటంతోపాటు ఆయా ప్రదేశాల్లో వీధి దీపాలు సక్రమంగా వెలుగని కారణంగా రాత్రి వేళల్లో ప్రయాణం నరకంలా మారుతోందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. వర్షాల సమయంలో మరీ ఇబ్బందిగా ఉంటోందని వాపోతున్నారు. ఎక్కడ గుంత ఉందో, ఎక్కడ రోడ్డు ఉందో తెలియని పరిస్థితి నెలకొంటోందని పేర్కొంటున్నారు. రాత్రి వేళల్లో పలు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఎంతో మంది రాత్రి సమయాల్లో ఈ గోతుల్లో పడి క్షతగాత్రులు అయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిని అభివృద్ధి పర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రయాణం నరకం



రహదారిలో కంకర రాళ్లు పైకి లేచి ఉండటంతో ప్రయాణం కష్టంగా ఉంటోంది. రహదారిలో గోతుల కారణంగా పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు సత్వరమే స్పందించి రహదారి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

– కె. రామదాసు, గ్రామస్తుడు

రోడ్డంతా గోతులు



రాత్రి సమయాల్లో గోతుల రహదారిలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. గోతులు కనబడక వాహనదారులు కిందపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిని బాగు చేసి మా గ్రామ సమస్యను పరిష్కరించాలి.

– యు. నాని, గ్రామస్తుడు

ఉచిత మెగా వైద్య శిబిరాలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిద్ధార్థ వైద్యులు

గుడివాడ టౌన్: రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని ప్రభావతి గార్డెన్స్‌లో జరిగిన ఈ శిబిరంలో పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్యబృందం 65 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు టీఎస్ రాజశేఖర్, కార్యదర్శి జి.కిరణ్‌బాబు, వైద్యశిబిరం కన్వీనర్ సి.సూర్యచంద్రరావు, ఎం.రమణమూర్తి, వై. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వద్ద ఆదివారం సురక్ష మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యబృందం వైద్య పరీక్షలు నిర్వహించింది. డాక్టర్ జగదీష్, డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ సత్యనారాయణ, సెక్రటరి లక్ష్మీనారాయణరెడ్డి, కోశాధికారి సీహెచ్ మోహన్‌రావు, చిన్నం గంగాధర్‌రావు, పి. కేశవ, బీ తిరుపతయ్య పాల్గొన్నారు.

సమాజానికి ఆదర్శం డీవీ సుబ్బారావు



సుబ్బారావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

గుడివాడ టౌన్: వృత్తి ధర్మం నిర్వహించడంలో సమాజానికి దేశిరెడ్డి వెంకట సుబ్బారావు ఆదర్శమని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక టీచర్స్ కాలనీలో విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి డీవీ సుబ్బారావు సంస్మరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. పలువురు ఉద్యోగులు, విద్యాశాఖ అధికారులు, విశ్రాంత విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆయనకు నివాళులర్పించారు. కార్యక్రమంలో డైట్ కళాశాల ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్, విశ్రాంత డీవైఈఓ జి.వెంకటేశ్వరరావు, పెడన మున్సిపల్ మేనేజర్ మట్టా రాజా, యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు నీలం ప్రభాకర రావు, ఎస్టీయూ జిల్లా నాయకుడు టీఎస్ రాజశేఖర్, ఎస్.పాల్ విజేంద్ర కుమార్, న్యాయవాది రవికుమార్, పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలతో మానసికోల్లాసం



గుడ్లవల్లేరులో పుస్తక పఠనంపై శిక్షణ ఇస్తున్న గ్రంథాలయాధికారి వాణి



మండవల్లి గ్రంథాలయంలో నీతి కథలు చదువుతున్న విద్యార్థులు

గుడ్లవల్లేరు: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించే శిక్షణ తరగతులు, క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని అంగలూరు, గుడ్లవల్లేరు గ్రంథాలయాధికారులు పీవీవీ పద్మజ, వాణి పేర్కొన్నారు. ఆదివారం విద్యార్థులకు చెస్, క్యారమ్స్, కుర్చీలాట, ఖోఖో వంటి ఆటల పోటీలతోపాటు పుస్తక పఠనం, చిత్ర లేఖనంపై శిక్షణ ఇచ్చారు.

జమీగొల్వేపల్లి శాఖ గ్రంథాలయంలో..

జమీగొల్వేపల్లి(పామర్రు): మండలంలోని జమీగొల్వేపల్లి శాఖ గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన పలు కార్డులను ప్రదర్శించారు. గ్రంథాలయ అధికారి వీ నాగసురేష్, ఉపాధ్యాయులు పద్మావతి, విశ్రాంత ఉద్యోగి సీహెచ్ కృష్ణమోహన్, యోగా గురువు వెంకట ధర్మారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీతి కథలు

మండవల్లి: మండవల్లి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులతో లైబ్రేరియన్ ఎస్‌కే పర్వీన ఆదివారం నీతి కథలు చదివించారు. ఆమె మాట్లాడుతూ నీతి కథలు సమాజం అభివృద్ధికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు.

ఘనంగా ప్రపంచ తల్లిదండ్రుల దినోత్సవం



పామర్రు: స్థానిక ఘంటసాల కళాపీఠం ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిదండ్రుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులను శాలువాలు, పుష్పమాలలతో సత్కరించారు. అనంతరం కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ మాట్లాడుతూ అమ్మ నాన్నల రుణం తీర్చుకోనిదని అన్నారు. వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత పిల్లలపై ఉందని పేర్కొన్నారు. అనంతరం తాళ్లూరి పూర్ణచంద్రరావు బాలరత్నం, చిన్నం ఆదినారాయణ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో కళాపీఠం సభ్యులు పరిశ నాంచారయ్య, టీ నరేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్సీఎం చర్చి ఫాదర్‌కు సన్మానం



పామర్రు: గ్రామంలోని ఆర్సీఎం చర్చి ఫాదర్‌గా పని చేసిన ఫ్రాన్సిస్ కీసరకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం స్థానిక చర్చిలో ప్రార్థనల అనంతరం ఫాదర్‌ను పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, సంఘ పెద్దలు, ఉపదేశకులు, సిస్టర్లు సన్మానించారు. ఆయన స్థానంలో చందర్లపాడు ఆర్సీఎం చర్చిలో పని చేస్తున్న చావట్ల తోమస్‌ను నియమించారు.

మల్లేశ్వరస్వామికి సహస్ర బిల్వార్చన

మండవల్లి: మండవల్లిలో కొలువై ఉన్న శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి సహస్ర బిల్వార్చన జరిగింది. భ్రమరాంబ అమ్మవారికి నవ విధ పుష్పాది, కుంకుమాదులతో లలితా సహస్రనామార్చన, తొమ్మిదిసార్లు మణిద్వీప వర్ధన పారాయణ కార్యక్రమాలు నిర్వహించారు.

అంబరాన్నంటిన అమలేశ్వరి జాతర

- తరలివచ్చిన భక్తులు
- గంటల కొద్ది నిలిచిపోయిన వాహనాలు



అమ్మవారి ఆలయానికి వెళ్లే మార్గంలో ఎదురెదురుగా నిలిచిన వాహనాలు

పెడన: దావోజిపాలెంలోని శ్రీవిజయ అమలేశ్వరి దేవి జాతర మహోత్సవాలు ప్రతి 11 సంవత్సరాలకు ఒకసారి నిర్వహిస్తారు. అంకెం వారి ఇలవేల్పు అయిన ఈ అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆదివారం చివరి రోజు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఉదయం నుంచే భక్తుల తాకిడి అధికమైంది. సాయంత్రానికి భక్తుల తాకిడి అధికమవడంతో ఆ రోడ్డు చక్రబంధంలో చిక్కుకుంది. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. భక్తుల సంఖ్య ఎక్కువగా ఉండదని అంచనా వేసిన అధికారులు తక్కువ మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసి విఫలమయ్యారు. పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రప్రసాద్, ఎస్ఐ సత్యనారాయణలతో పాటు మరో నలుగురు కానిస్టేబుల్స్ ట్రాఫిక్ క్లియర్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. సాయంత్రం నుంచి ట్రాఫిక్ సమస్య లేకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. ముందునుంచే చర్యలు తీసుకుంటే బాగుండేదనే వాదన భక్తుల నుంచి వ్యక్తమైంది.

రేషన్ షాపుల్లో సరుకుల పంపిణీపై అసంతృప్తి



ముదినేపల్లి మండలంలో రేషన్ కోసం క్యూ కట్టిన ప్రజలు

మండవల్లి: రేషన్ షాపుల ద్వారా బియ్యం, పంచదార వంటి సరుకులను మళ్లీ ప్రారంభించడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకు ఎండీయూ వాహనాలు వచ్చి సరుకులు ఇచ్చేవని గుర్తుచేసుకున్నారు. అప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గడచిపోయిందని పేర్కొంటున్నారు. ఇప్పుడు ఆ వాహనాలు రద్దు చేసి రేషన్ షాపుల ద్వారా సరుకులు అందిస్తుండటంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కైకలూరు: రేషన్ వాహనాలను తొలగించి ప్రభుత్వం పాత పద్ధతిలోనే దుకాణాల ద్వారా సరుకుల పంపిణీకి నుంచి శ్రీకారం చుట్టింది. దీంతో ప్రారంభం రోజునే అనేక మంది రేషన్ షాపుల వద్ద క్యూ కట్టారు. కైకలూరు నియోజకవర్గం నాలుగు మండలాల్లో 161 రేషన్ సరఫరా దుకాణాలు, 74,827 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇప్పటి వరకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించిన ఎండీయూ వాహనాలు ఇంటికే పరిమితమయ్యాయి. మొదటి రోజు పాత పద్ధతిలో రేషన్ కోసం ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

వెన్నుపోటు దినం.. విజయవంతం చేయండి



వెన్నుపోటు దినం వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ అశోక్‌కుమార్ తదితరులు

పామర్రు: కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అరాచకాలను ఖండిస్తూ ఈనెల నాలుగో తేదీన వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వెన్నుపోటు దినం వాల్ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన క్షణం నుంచి రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై కక్ష సాధింపులే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. హత్యలు, దాడులు నిత్యకృత్యమయ్యాయని అన్నారు. ఏడాది పాలనలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై 766 హత్యలు, హత్యాయత్న ఘటనలు జరిగాయన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భద్రత విషయంలో కూటమి సర్కారు కుట్రలు చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తాడిశెట్టి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, గ్రామ ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, నందిరాజు, నత్తా నాని, కొచ్చెర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తోట్లవల్లూరు: స్థానిక సబ్‌స్టేషన్‌లో సాంకేతిక మరమ్మతుల కారణంగా మండలంలోని యాకమూరులో సోమవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఉయ్యూరు డీఈఈ కృష్ణానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గుడ్లవల్లేరు: విద్యుత్ లైన్ల ఏర్పాటు నిమిత్తం సోమవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు 33/11 కేవీ కౌతవరం సబ్‌స్టేషన్‌లో ఉన్న 11కేవీతోపాటు కౌతవరం, వడ్లమన్నాడు ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గుడివాడ ట్రాన్స్‌కో ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. కౌతవరం, వడ్లమన్నాడు, వేమవరం, వేమవరంపాలెం, గాదేపూడి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కృష్ణాపురం సబ్‌స్టేషన్ పరిధిలో..

పమిడిముక్కల: మండలంలోని కృష్ణాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని కృష్ణాపురం, ఎస్సీ కాలనీ, చోరగుడి, లంకపల్లి రైస్ మిల్లుకు సోమవారం ఉదయం ఆరు నుంచి తొమ్మిది గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బీ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 4వ తేదీన గొడపాలెం, ఐనపూరు, కూడేరు, శ్రీరంగపురం, లంపల్లి ఏరియాల్లో, 6న చోరగుడి, నారాయణపురం, పెనుమత్స ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పెదపారుపూడి: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రామంలో సోమవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12 గంటల సరఫరా నిలిపివేయనున్నట్లు గుడివాడ డివిజన్ ఈఈ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కైకలూరు: సబ్ స్టేషన్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం ఏడు నుంచి 11 గంటల వరకు కైకలూరు టౌన్, వరహాపట్నం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ శ్రీనివాసరావు తెలిపారు.

సయ్యద్‌పై దాడి అమానుషం



సయ్యద్‌ను పరామర్శిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

గుడివాడ టౌన్: వైఎస్సార్ సీపీకి చెందిన షేక్ సయ్యద్‌పై దాడి చేయడం అమానుషమని ఏపీ బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వేముల బేబీరాణి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వలివర్తిపాడు రోడ్డులోని ఏపీ సంచార జాతుల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ సయ్యద్‌ను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి చెందిన సయ్యద్‌ను బెదిరించి పార్టీ మారాలనడం దారుణమన్నారు. దాడులు చేస్తే వైఎస్సార్ సీపీ శ్రేణులు భయపడేది లేదన్నారు. సయ్యద్‌పై దాడి చేసిన వారిని గుర్తించి పోలీసులు శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావులకొల్లు వెంకట మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బోయిన సోమశేఖర్, రాష్ట్ర కార్యదర్శి నయనవరపు శేషబాబు, ఎం. శ్రీనివాసరావు, విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సత్యనారాయణ, పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు వేముల శ్రీదేవి, డి. మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ప్రధానోపాధ్యాయులు

మొవ్వ/పమిడిముక్కల/తోట్లవల్లూరు: ఇటీవల జరిగిన బదిలీల్లో మొవ్వ మండలానికి బదిలీలపై విచ్చేసిన ప్రధానోపాధ్యాయులు ఆదివారం ఆయా పాఠశాలల్లో బాధ్యతలు చేపట్టారు. నిడుమోలు జెడ్పీ హైస్కూల్ ప్లస్(బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్) హెచ్‌ఎం కాసాని అరుణ, కూచిపూడి శ్రీసిద్ధేంద్ర జెడ్పీ ఓరియంటల్ హైస్కూల్ హెచ్‌ఎంగా అమిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి, పెడసనగల్లు హెచ్‌ఎంగా వడ్డీ వెంకట సంజీవరావు, కోసూరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా వీ సమాధానరావు, మొవ్వ పీఎం శ్రీశ్రీ మండవ కనకయ్య జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా నిమ్మగడ్డ ఉమశ్రీలు బాధ్యతలు చేపట్టారు. గరికపర్రు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా అడిదం శ్రీకృష్ణ, పమిడిముక్కల హైస్కూల్ హెచ్‌ఎంగా వై.దుర్గాభవాని, కపిలేశ్వరపురం హైస్కూల్ హెచ్‌ఎంగా తులసిరాణి, చోరగుడి హైస్కూల్ హెచ్‌ఎంగా టి.సంధ్యారాణి, ఐనపూరు హైస్కూల్ హెచ్‌ఎంగా తమ్మన వేణుగోపాలరావు బాధ్యతలు స్వీకరించారు.

బీసీ చైతన్య వేదిక అధికార ప్రతినిధిగా లుక్కా



వీరవల్లి శ్రీనివాసరావు నుంచి నియామకపత్రం అందుకుంటున్న లుక్కా

తోట్లవల్లూరు: బీసీ చైతన్య వేదిక జాతీయ అధికార ప్రతినిధిగా మండలంలోని రొయ్యూరుకు చెందిన బీసీ జనగణన సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు లుక్కా వెంకట శ్రీనివాసరావు నియమితులయ్యారు.

విజయవాడలో ఆదివారం జరిగిన సమావేశంలో బీసీ చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాసరావు చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నట్లు లుక్కా శ్రీనివాసరావు తెలిపారు. జాతీయ స్థాయిలో బీసీల సమస్యలపై తన వంతు పోరాటం సాగిస్తానని ఆయన పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన జాతీయ అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

సుబ్బారాయుడికి ప్రత్యేక పూజలు



సుబ్బారాయుడిని దర్శించుకుంటున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం – చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని పుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకున్నారు. పాలపొంగళ్ల శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారు చేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద, గోకులంలోని గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద వితరణ ఏర్పాట్లు చేశారు.